www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025

5

అన్నమయ్య



మంత్రిని కలిసిన రాష్ట్ర కమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ స్వర్ణ



డైరెక్టర్ స్వర్ణను సన్మానిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర కమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ గుడిసర్ల స్వర్ణ శుక్రవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఎంపికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మంత్రిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండా భాస్కర్‌రెడ్డి, గడి రఘునాథ, బిసి సంఘం మహిళా జిల్లా అధ్యక్షులు పద్మ యాదవ్, పలువురు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా రంగంలో సమున్నత మార్పులు

- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఉపాధ్యాయులు సమున్నత లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ రెసిడెన్సీ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ప్యాలెగ్రి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు, అటవీ శాఖ డైరెక్టర్ రెడ్డయ్య ప్రధాన అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్నతమైన విలువలు, విజ్ఞానం నింపి దేశ భవిష్యత్ తరాలను సమాజానికి దిశానిర్దేశం చేసేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యా రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చామన్నారు. మెగా డిఎస్‌సి నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసినట్లు తెలిపారు. గత డిఎస్‌సితో పోలిస్తే ఈ విడత డిఎస్‌సి ప్రత్యేకత సంతరించుకుందని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భర్తీ ప్రక్రియ పూర్తయిందన్నారు. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచినట్లు, ఈ క్రమంలో 421 పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే 175 నియోజకవర్గాల్లో ఎంపికైన అభ్యర్థులందరికీ విజయవాడలో ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఎలాంటి లోటు లేకుండా, గతంలో కంటే మిన్నగా విద్యార్థులందరికీ పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మెనూ ప్రకారం భోజన పదార్థాలను అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసిన 117 జిఒను రద్దు చేశామని, ఉపాధ్యాయ సమస్యలను చట్ట పరిమితులలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్త్రీశక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళలందరికీ ఎక్కడినుండి ఎక్కడికైనా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వాటిని ఏ విధంగా సమాజానికి ఉపయోగపడుతుందో గుర్తించి ముందుకు నడిపేవారే గురువులన్నారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి ఒక్కరికి ప్రేరణ అవుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడమే కాకుండా, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. గురువులు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలను నేర్పడం, సమాజంలో ఒడిదుడుకులను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తారన్నారు. జిల్లాలో ఉత్తమమైన సేవలు అందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది మంచి పేరు తెచ్చుకున్న 56 మంది గురువులను సన్మానించుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గురువుకు స్థానం గొప్పదన్నారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, ప్రగతి ప్రధాన నిలవాలన్నా ఉత్తమ పౌరులు తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం జిల్లాలోని 56 మంది ఉపాధ్యాయులను పేరుపేరునా ఆత్మీయంగా పలకరిస్తూ ఘనంగా సన్మానం చేశారు. అంతకు ముందు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గవర్నమెంట్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఇఒ కె.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డిఇఒలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పరిరక్షణకు ప్రజా ఉద్యమం

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు



వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైద్య కళాశాలలు పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించడం వలన మదనపల్లి ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం దూరం అవుతుందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి మండలి రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలను పిపిపి ద్వారా అభివృద్ధి చేయాలనే నిర్ణయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మదనపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిపిపి పద్ధతిని రద్దు చేయాలని, మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రిని ప్రయివేట్ పరం చేయొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు, పీలేరు నియోజకవర్గం కర్ణాటకలోని కోలార్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నదని, మెడికల్ కళాశాలగా అభివృద్ధి అయితే అన్ని రకాల సేవలు ఇక్కడే పొందవచ్చునని, చిన్నచిన్న జబ్బులకు కూడా 150 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉండదని ప్రజలు కళలు కన్నారన్నారు. మదనపల్లి ప్రజల ఆశలపై కూటమి ప్రభుత్వం మట్టి కొట్టే విధంగా మెడికల్ కళాశాలను పిపిపి పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. పిపిపి అంటేనే ప్రయివేట్‌కు అప్పగించడమేనని పేర్కొన్నారు. ప్రతి సేవకు డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి వస్తుందని, దీనివల్ల ప్రభుత్వ వైద్యం ఖరీదుగా మారిపోయి పేదలకు అందని ద్రాక్షగా మారుతుందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం రూ.475 కోట్లతో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాల నిర్మించాలని ప్రయత్నించి, దాదాపు 70 శాతం పనులు పూర్తి చేసిందని 2024 లో మెడికల్ కళాశాల క్లాసులు ప్రారంభించాలనే లక్ష్యంగా పనులు చేపట్టిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను అమ్మ కానికి పెట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల 300 మంది మెడికల్ సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. మరో మూడు వందల సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా రాష్ట్ర మంత్రి మండలి చేసిన నిర్ణయం కారణంగా మెడికల్ కాలేజ్ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి పోవడమే కాకుండా, మెడికల్ కళాశాలకు అనుబంధంగా మార్చిన ప్రభుత్వ ఆసుపత్రి కూడా ప్రైవేటీకరణ అవుతుందని వివరించారు. మెడికల్ కాలేజ్ నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె.సోమశేఖర్, సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, నాగరాజు, అఫ్రీద్, జయబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ కుమార్

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి : బిఎస్‌పి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు పరం చేయడమంటే ఉచిత వైద్యాన్ని పేదలకు దూరం చేయడమేనని బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలను అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. రూ.కోట్లు అర్జించడం కోసమే ప్రయివేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టించి మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని లేని పక్షంలో రాజీనామా చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌కు రాజకీయ బిక్ష పెట్టిన మదనపల్లికి న్యాయం చేయకుంటే ప్రజల దృష్టిలో ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు. మదనపల్లి మెడికల్ కళాశాల విషయంలో ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల ఆందోళన చేసిన సమయంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇచ్చిన హామీని గుర్తుచేశారు.ి ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో మందుల కొరత, ఓపిడి సేవలు, వైద్యులు లేక పేదలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం సమంజసం కాదని దీనిపై పునరాలోచించి ప్రయివేటుకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అందరిని కలుపుకొని ప్రజా ఉద్యమాలకు పూనుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు మిద్దేపల్లి బాలాజీ, సహదేవ, చంద్ర, మహేష్, ప్రశాంత్, నీలు, దంపేట్ల శివ, రెడ్డెప్ప, మొపూరి రెడ్డెప్ప, వేణులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం : 'చింతల'



పోస్టు కార్డును పోస్టు బాక్స్‌లో వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, రైతులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

యూరియా దొరక్క రైతుల పడుతున్న గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా, యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పోస్టు కార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, పోస్టు కార్డులను స్థానిక పోస్టల్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బయట మార్కెట్‌లో యూరియా అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం త్వరతిగతిన సరఫరా చేసి, రైతులకు అందించాలని పేర్కొన్నారు. బయట మార్కెట్‌లో యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కనీసం పంటలకు అవసరమైన ఎరువులు కూడా అందించడం లేదన్నారు. అవసరమైన యూరియా అందిస్తే రైతులు రోడ్లపైకి ఎందుకు వస్తారని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. గత వైసిపి పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేశామని పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలోని ప్రతి వైసిపి కార్యకర్త, నాయకుడు తమ పరిధిలో పోస్టు కార్డుల ద్వారా యూరియా కొరత సమస్యను రాసి పోస్టుకార్డులను ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, మునిభాస్కర్, చంద్రశేఖర్, చలపతి, సత్య తదితరులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్‌లో చీరలను వీక్షిస్తున్న సినీనటి అనసూయ

మదనపల్లెలో సినీనటి అనసూయ సందడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో సినీనటి అనసూయ సందడి చేశారు. శుక్రవారం సితార షాపింగ్ మాల్‌ను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి ఆమె ప్రారంభించారు. అనసూయను చూడడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. యజమానులతో కలిసి సితార షాపింగ్ మాల్‌ని ప్రారంభించిన అనసూయ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన షాపింగ్ మాల్స్‌లో సితార షాపింగ్ మాల్ ఒకటన్నారు. ప్రశాంతతకు మారుపేరైన మదనపల్లి పట్టణంలో ఇటువంటి షాపింగ్ మాల్ ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు. ఇక్కడ ప్రజలు తనపై చూపిన అభిమానం ఎన్నటికీ మర్చిపోలేనన్నారు. అనంతరం దుకాణ యజమానులు మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మదనపల్లి పట్టణంలో సితార షాపింగ్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో చిన్న పిల్లలు, పురుషులు, మహిళలకు పలు రకాల డిజైన్లలో దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దుకాణం ప్రారంభం సందర్భంగా అనేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని, అతి తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలు అందించడం మా దుకాణం యొక్క ప్రత్యేకతన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సితార షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేసిన అతిథులకు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి, టిడిపి నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి, నాదెళ్ల విద్యాసాగర్, నవీన్ చౌదరి, వైసిపి ఎస్‌టి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున హాజరయ్యారు.

'మిట్స్'లో ఘనంగా ఓనమ్ పండుగ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె : మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఓనమ్ పండుగను విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ప్రోఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ హాజరై మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్రంలో జరుపుకునే పండుగలు ఆయా రాష్ట్రాల ప్రత్యేకతను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తెలంగాణలో బతుకమ్మ, బోనాలు, తమిళనాట దీపావళి ఎంత ప్రాచుర్యం పొందాయో, కేరళ రాష్ట్రానికి ఓనమ్ పండుగ కూడా అంతే ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. ఓనమ్ పండుగ సమానత్వం, ఐకమత్యం, సంతోషానికి ప్రతీకగా నిలుస్తుందని, విద్యార్థులు ఇలాంటి వేడుకల ద్వారా భారతీయ సంప్రదాయాల వైభవాన్ని తెలుసుకోవాలని ద్వారకానాథ్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేరళ సంప్రదాయాలకు అనుగుణంగా పూలతో అలంకరించిన పువ్వుల ముగ్గులు, సాంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలతో వేడుకలను ఉత్సాహంగా జరిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ కో-ఆర్డినేటర్ వై.ప్రదీప్‌కుమార్, సాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేరళ సంప్రదాయ వేషధారణతో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రాంగణ ఎంపికల్లో 18 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టాప్ అకాడమీ సంస్థ ఆధ్వ ర్యంలో ప్రాంగణ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విభా గాలకు చెందిన 18 మంది విద్యార్థులు రూ.3.05 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ ధీరజ్ తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామ లింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖ రాలను అధిరోహించి తల్లిదండ్రులకు, కళాశాలకు గౌరవం తీసుకురావాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి.మనోజ్ కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు స్థలం కేటాయింపుపై రూట హర్షం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/అర్బన్

రాయచోటిలో ప్రభుత్వ యునాని వైద్య కళాశాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్ 538లో 10 ఎకరాలు స్థలం కేటాయించడంపై రూటా నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో రూట (రియాసత్ ఉర్దూ ఉపాధ్యాయ సంఘం) అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సబాతుర్ రెహ్మాన్ మాట్లాడుతూ ఉర్దూ చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాయచోటి ప్రాంతంలో యునాని వైద్యకళాశాల ఏర్పాటు చేయడం వల్ల చాలామంది ఉర్దూ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారి అసదుల్లా బాషా మాట్లాడుతూ గత శతాబ్ద కాలంగా రాయచోటిలో ప్రభుత్వ డైట్ కళాశాల వేల మందిని ఉర్దూ ఉపాధ్యాయులుగా తీర్చిద్దరని పేర్కొన్నారు ఆదే తరహాలో యునాని కళాశాల ఏర్పాటు వలన ఎంతో మంది ఉర్దూ విద్యార్థులను యునాని వైద్యులుగా తీర్చిదిద్ద వచని పేర్కొన్నారు. రూటా నేతలు మహమ్మద్ అలీ, ఇలియాస్ మాట్లాడుతూ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతోనే కళాశాలకు స్థలం మంజూరయిందన్నారు. ప్రభుత్వం త్వరగా కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టి త్వరగాపూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా ప్రవేశాలు జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో రుటా రాష్ట్ర సభ్యులు మహమ్మద్ అలీ, ఇలియాస్, జిల్లా అసో సియేట్ ప్రెసిడెంట్ జాఫరు దీన్, కోశాధికారి ముహిబల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెహ్మాన్

ప్రీమియంపై జిఎస్‌టి రద్దు హర్షణీయం

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జిఎస్‌టిని రద్దు చేయడం పట్ల ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 22 నుంచి జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయడం పాలసీదారులకు మేలు చేకూరుతుందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఎఐఐఇఎ నాయకత్వంలో తాము చేసిన అవిరామ ప్రచారం, కూడగట్టిన ప్రజల మద్దతు ఈ విజయానికి కారణమని అన్నారు. జిఎస్‌టి రద్దు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్‌బాషా, రాజు, వారిజాతమ్మ, పర్వీన్, రత్న కిషోర్, చిన్నయ్య, సాదక్, శీను, గౌస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం కోసం వినతి

ప్రజాశక్తి - కడప: రజకులకు కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలని జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చేలో రవి మాట్లాడుతూ కడప నగరంలోని బాలాజీ నగర్ ,రైతుబజార్ ప్రక్కన సర్వే నంబర్ 71/1 గత 50 ఏళ్లుగా దోబీఘాట్ ఉన్న స్థలంలోనే పునర్నిర్మాణం కోసం 2018లో దోబీఘాట్ కోసం రూ.5.50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాక 20 సంవత్సరాలుగా జీవిస్తున్న స్థానికులు కోర్టు కెళ్ళి పనులు చేయ కుండా స్టే తెచ్చుకున్నారు అన్నారు. ఇంతవరకు ఆ స్టే ఏ పరిస్థితిలో ఉందో అర్థం కావడం లేదని చెప్పారు.దోబీఘాట్‌పై స్టేను ఎత్తివేసి ఆ స్థలంలో రజకులకు కమ్యూనిటీ భవనం నిర్మించేలా చర్యలు తీసకోవాలని కోరారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలను పొందాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్‌లో శుక్రవారం ప్రొఫరైటర్ ఫర్హాన్ చే నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్‌డి మొబైల్స్ షాప్ ప్రారంభంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ల వినియోగం ఎంతో పెరిగిందని, ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు మరియు సేవలు అందించడమే వ్యాపార విజయానికి కీలకమన్నారు. ఎమ్‌డి మొబైల్స్ అదే దిశగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైసిపి పట్టణ అధ్యక్షుడు నవాజ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్, టెలికాం కమిటీ సభ్యుడు అబుజర్ పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ దుకాణం ప్రారంభోత్సవంలో శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రేపు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - కడప

ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (వైఎస్ఆర్, అన్నమయ్య) జిల్లా స్థాయి జూనియర్స్(బాల బాలికలు) ఎంపికలు ఈనెల 7వ తేదీ జమ్మల మడుగు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, కార్యదర్శి జి.వెంకట రమణ తెలిపారు. ఈ పోటీల ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయని తెలిపారు. జూనియర్స్ ఎంపికలకు సంబంధించి 2006 జనవరి 2వ తేదీ తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. జూనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ ఈ నెల 12, 13, 14వ తేదీలలో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ తప్పనిసరిగా పుట్టిన తేదీ కలిగిన ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పదవ తరగతి మార్క్స్ మెమో, 8 ఫొటోలు, డ్రెస్ కోడ్, ష్యూష్ వేసుకొని తప్పనిసరిగా సెలెక్షన్‌కి వచ్చేటప్పుడు అన్నీ తీసుకొని రావాలని పేర్కొన్నారు. అలా లేని పక్షంలో సెలెక్షన్స్‌కి అనుమతించరని తెలిపారు. మరిన్ని వివ రాలకు 9490181104, 7036907303 నంబర్లకు సంప్రదిం చాలని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఎస్.ఉప్పలపాడు గ్రామ పెద్ద శ్రీనివాసులరెడ్డి ఉచిత భోజన వసతి కల్పిస్తారని తెలిపారు.



డాక్టరేట్ పట్టా అనుకుంటున్న కోలా నాగేంద్ర

రాజంపేట వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని పోలి న్యూకాలనీకి చెందిన కోలా నాగేంద్ర ప్రతిష్టాత్మకమైన తెలంగాణ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ డి.రవీంద్రనాథ్ సోళమాన్ మార్గద ర్శకత్వంలో ఆయన పరిశోధనను పూర్తి చేశారని, భారత దేశంలోని ప్రభుత్వ రంగ స్థలంలో కామర్స్ విభాగం ఫోరెన్సిక్ అకౌంటింగ్ పనితీరు ప్రాముఖ్యత అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ప్రస్తుతం ఇండియన్ మారి టైం యూనివర్సిటీ చెన్నై క్యాంపస్ లో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న కోలా నాగేంద్రకు డాక్టరేట్ రావడం పట్ల రాజంపేట మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అనంతపురంపై నెల్లూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 160 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 239 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 242 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 350 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 14 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 48.1 ఓవర్లలో 187 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని భార్గవ్ రాజు 45, అర్జున్ టెండూల్కర్ 44 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నారాయణ 3 అఖిల్ సాలుంకే 3 వికెట్లు తీసుకున్నారు.


మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

9న రైతుల నిరసనకు తరలిరండి

ప్రజాశక్తి-సుండుపల్లి

ఈనెల 9న జిల్లా కేంద్రం రాయచోటిలో జరగబోయే రైతుల నిరసన కార్యక్రమానికి వైసిపి శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని మండల వైసిపి అధ్యక్షులు ఎ.రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యం.రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. రైతులకు సకాలంలో అందించాల్సిన యూరియా సరఫరా చేయడంలో చేతులెత్తేసిందన్నారు. 9న కలెక్టరేట్ ఎదుట జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే నిరసన కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం అధ్యక్షులు వై.ఆరంరెడ్డి, సుండుపల్లి మండల జడ్‌పిటిసి ఎస్.ఉస్మాన్, రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి రెహమాన్ ఖాన్, జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షులు చంద్రనాయక్, పెదినేని కాలువ ఉపసర్పంచ్ రఫీక్, బాబురెడ్డి ఎంపిటిసి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి ,నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.


రోడ్డును చదును చేస్తున్న జెసిబి

చకచకా కోసువారిపల్లెకు రోడ్డు పనులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లె వరకూ సుమారు 78.మీ మేర రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తంబళ్లపల్లె టిడిపి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో పీఎంజిఎస్‌వై ద్వారా రూ.7.65 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మూడు రోజులుగా రోడ్డు వైపున చెట్లు, గడ్డి తొలగింపు పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణంతో సుమారు 13 గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

'గౌతమ్'లో ఘనంగా ఓనమ్ వేడుకలు

ప్రజాశక్తి-గాలివీడు

కేరళ రాష్ట్రం ప్రత్యేక పర్వదినమైన ఓనమ్ పండుగను స్థానిక గౌతమ్ పాఠశాలలో కేరళ ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలో పాల్గొని పువ్వులను అలంకరించి, సాంప్రదాయ ఆటలు, పాటలతో సందడి చేశారు. అనంతరం ఓనసద్యలో ప్రత్యేక వంటకాలను రుచి చూసి ఆనందించారు. పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమాన్యుల్ మాట్లాడుతూ ఓనం పండుగ ఐక్యత, సాంప్రదాయాల ప్రతీకగా ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పది రోజుల పాటు జరుపుకునే పూలరంగోలి, వల్లి కలి ఆటలు, ఓనసద్య విందు ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రంగీన్ సాహెబ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-కలకడ

సంబేపల్లి మండలం ఎస్ సోమవరం అగ్రహారానికి చెందిన రంగీన్ సాహెబ్ గత రెండు రోజుల క్రితం పీలేరు సమీపంలో మదనపల్లి- తిరుపతి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య నసీబ్ జాన్ రక్త గాయాలు పాలై కుడికాలు విరిగి తిరుపతిలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం మృతుడు రంగీన్ సాహెబ్ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం మృతుడి కుమారుడు సయ్యద్‌బాషా, కుమార్తెలు పర్వీన్, షమీం, నశ్రీన్ లను ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో సిండిల్ విండో కమిటీ డైరెక్టర్ వేణుగోపాల్ నాయుడు, ఖాదర్ బాషా, సైపుల్ల, టిడిపి నాయకులు సాయి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని కోసువారిపల్లెలోని ప్రసన్న వేంకటరమణ స్వామి పవిత్రోత్సవాలు టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేద పండితులు సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. శాస్త్రోక్తంగా చతుస్థానార్చన, మహా పూర్ణహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, స్నపన తిరుమంజనం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపినాథ్, నగేష్, విశాంత్ కుమార్ భక్తులో పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో యూనివర్సిటీ పోడ్‌కాస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయి ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో యూనివర్సిటీ పోడ్‌కాస్ట్‌ను ప్రారంభించారు. శుక్రవారం క్యాంపస్‌లోని కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కో- ఆర్డినేటర్ నందిగం సత్యానందరాం ఆధ్వర్యంలో నిజమైన చర్చలు, నిజమైన నైపుణ్యాలు, వాస్తవ ప్రపంచం అనే పేరుతో యూనివర్సిటీ పోడ్‌కాస్ట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆన్ లైన్‌లో యుఎస్‌ఎ నుంచి సీనియర్ మైక్రోసాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న మధుసూదనరెడ్డి విద్యార్థులకు ప్రస్తుతం ఐటి రంగంలో ఉన్న అవకాశాలు, అలవర్చుకోవలసిన నైపుణ్యాలు గురించి వివరించారు. ప్రతి నెలా రెండు సెషన్లు నిర్వహించే ఈ పోడ్‌కాస్ట్ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధం కావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పి. రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విసి సాయిబాబారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి నారాయణ అధ్యాపక బృందంతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల టచ్ స్టోన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఎస్.రెహనా మొదటి బహుమతిని గెలుపొందగా జి.సాయి వైష్ణవి ద్వితీయ బహుమతి సాధించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు విసి డాక్టర్ సాయిబాబా రెడ్డి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి డాక్టర్ ఓబులపతి, టచ్‌స్టోన్ ఇన్‌ఛార్జి విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఎస్‌టియు ఆధ్వర్యంలో జాతీయ ఉపాద్యాయ దినోత్సవాన్ని స్థానిక మండల వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు జి.చక్రధర్‌రాజు, బి.నాగతిరుమల రావు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల దండతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యాధికారులు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా దేశములోనే విశేష కీర్తి సంపాదించారని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు రాష్ట్రపతి స్థాయికి ఎదగడం ఉపాధ్యాయ లోకానికి గర్వించదగ్గ విషయమన్నారు. ఆయన పుట్టినరోజు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మన దేశ గొప్పతనం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి.సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి శివరాంప్రసాద్, మండల ఉపాధ్యక్షులు మునగపాటి శ్రీను, ఎస్‌టియు నాయకులు హరినాథ్, బాలనరసింహులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఉపాధ్యాయు లకు ఘనంగా సన్మానించారు.

బి.కొత్తకోట : ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి యన్.క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

మదనపల్లె: స్థానిక ఎన్టీఆర్ కళ్యాణమండపంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. నియోజకవర్గ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువాలతో సత్కరించి, మొమెంటోలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ, విద్యావ్యవస్థ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని, వారు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడిపి, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీలోని జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరకోటి చంద్రశేఖర్ మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం అందుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశే ఖర్, ఉపాధ్యాయులు, విద్యార్తులు హర్షం వ్యక్తం చేశారు.


రాజంపేట : విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణ

సుండుపల్లి : మండల కేంద్రం సుండుపల్లిలోని ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న నూర్‌అహ్మద్ సేవలను గుర్తించి ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండేపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.

లక్కిరెడ్డిపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కలెక్టర్ చామకూరి శ్రీధర్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రరెడి, డిఇఒ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపల్‌గా వరాల రమేష్ అవార్డు అందు కున్నారు. లక్కిరెడ్డిపల్లి ఎపి మోడల్ స్కూల్ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని మంత్రి కొనియాడారు. **రైల్వేకోడూరు :** మండలంలోని ఆర్.రాచపల్లి జడ్‌పి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తలపల రేవతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. **నందలూరు :** మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ మహమ్మద్‌షఫీ ఉల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. రాయచోటి పట్టణంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలోని పలువు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. **పీలేరు:** అన్నమయ్య జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడుగా బి. వెంకటరమణ పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలోని మేళ్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఎ (గణితం) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బి.వెంకటరమణ జిల్లా కేంద్రంలో జరిగిన పురస్కారాల ప్రధానోత్సవంలో రాష్ట్ర రవాణా, క్రీడలు యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, డిఇఒ కె. సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. పురస్కార గ్రహీతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


లక్కిరెడ్డిపల్లి : ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందుకుంటున్న రమేష్


గాలివీడు : ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్


సుండుపల్లి : అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు నూర్‌అహ్మద్

ఘనంగా మిలాద్-ఉన్-నబి వేడుకలు


కలకడ : మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జబ్బార్ సాహెబ్

ప్రజాశక్తి-కలకడ

మిలాద్-ఉన్-నబి వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. సంబేపల్లి మండలం ఎస్. సోమవరం పంచాయతీ దేవళంపేటలో ఉన్న రిటైర్డ్ ఆర్మీ , రిటైర్డ్ పోస్టు మెన్ జబ్బార్ సాహెబ్ కుటుంబంలో నిర్వహించిన మిలాద్- ఉన్- నబీ వేడుకల్లో మంత్రి పాల్గొని ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిములు జరుపుకునే పండుగలు మిలాద్-ఉన్-నబీ పండుగ కూడా ముఖ్య మైనదని అన్నారు. దయా, కరణ, జాలి, ప్రేమ, అనురాగం, మమత అనే పదాలకు తార్కాణం మిలాద్- ఉన్- నబీ పండుగని తెలిపారు. జబ్బర్ సాహెబ్ కుటుంబ సభ్యులు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జబ్బార్ సాహెబ్ కుమారులు, సయ్యద్ సాహెబ్, మహబూబ్‌బాషా, జిలాని బాషా, అన్సర్‌బాషా, దాను, సాయిపవన్ కుమార్, కాలేశా, చంద్రబాబు నాయుడు, గ్రామస్తులు, పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మహమ్మద్ ప్రవక్త జన్మది నం వేళ మీలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకొని పట్టణంలో ముస్లిం సోదరులు ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. స్థానిక చౌక్ మస్జిద్ నుంచి దిగువ బస్టాండ్, బైపాస్ రోడ్డు రంగసముద్రం రోడ్డు మీదుగా బెంగళూరు రోడ్డు జామియా మసీదు వరకు పుర వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో మతపెద్దలతో కలిసి మాన వహారం నిర్వహించారు. అనంతరం ఇమాంషావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి మహమ్మద్ ప్రవక్తను స్మరించుకొన్నారు. మీలాద్ ఉన్ నబీ సంద ర్భంగా మిఠాయిలు పంచిపెట్టి అన్నదానం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా సి.ఐ గోపాల్ రెడ్డి, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

కలుపు నివారణతో అధిక దిగుబడులు

- ఆదర్శ రైతు అమృనాయక్

ప్రజాశక్తి-సుండుపల్లె

వరి పంట తెగుళ్ల బారిన పడకుండా అధిక దిగుబడి కోసం గట్టుల పైన కలుపు మొక్కలను తొలగించాలని జిల్లా ఉత్తమ ఆదర్శ రైతు అమృనాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆరోగ్యపురంలో తన ఎకరా వరి పొలంలో గట్లపై ఉన్న కలుపు మొక్కలను ఎలా తీసి వేయాలని అవగాహన కల్పించారు. కలుపు మొక్కలను తీసి వేయడం వల్ల ఎలుకలు, పాముల, క్రిమికీట కాల నుంచి పంటను కాపాడు కోవచ్చని చెప్పారు. కలుపు మొక్కలను తొలగించకుండా పంటకు హాని చేసే కీటకాలు వాడినప్పటికీ కలుపుమొక్కల్లో ఉండి తర్వాత మళ్లీ పంట మీద పడి పంట నష్టం చేస్తాయని అన్నారు. వరి పంటలో కలుపు మొక్కలను తొలగించడానికి, వరి నాటిన వెంటనే కలుపు మందులు వాడటం లేదా చేతితో కలుపు తీయడం వంటి పద్ధతులను ఉపయోగించాలని తెలిపారు. వరి నాటిన 3 నుంచి 5 రోజులలోపు కలుపు నివారణకు ఉపయోగించే మందులను సరైన మోతాదులో వాడాలన్నారు. కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు చేతితో కలుపు మొక్కలను తీసివేయడం మంచి మార్గమని అన్నారు. వరి పంటకు అందాల్సిన శక్తిని ఈ కలుపు మొక్కలు తీసుకోవడం వల్ల పంటకు నష్టం జరుగుతుందని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు పీకివేస్తూ ఉండాలన్నారు. వరి పంటకు అందాల్సిన పోషకాలను గ్రహించి, పంట దిగుబడిని తగ్గిస్తాయని తెలిపారు. దీని వల్ల రైతు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. రైతులు పంట వేసిన దగ్గర నుంచి అది చేతికి వచ్చేంత వరకు అత్యంత జాగ్రత్తగా కాపాడుకో వాలన్నారు. తెగులు బారిన పడకుండా, సరిపోయేంత నీళ్లు అందేలా, కలుపు మొక్కలు రాకుండా చూసుకోవాలన్నారు. ఇవన్నీ దగ్గరుండి చూసుకుంటేనే రైతులు పెట్టిన పెట్టుబడికి తగిన మంచి దిగుబడి వస్తుందన్నారు


కలుపు మొక్కలను తొలగిస్తున్న అమృనాయక్

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలు తీష్ట వేశాయని, వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో డ్రెయినేజీ, వీధిలైట్ల కొరత అధికంగా ఉన్నాయని చెప్పారు. వీధులలో కుక్కలు, ఆవుల బెడద ఎక్కువగా ఉందని, ఆవులను గోశాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. పట్టణంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని కొన్ని వార్డులలో రెండు మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ మున్సిపాలిటీకి సంబంధించి రూ. 26 కోట్లకు పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు నివేదికలు పంపామని చెప్పారు. నిధులు వచ్చిన వెంటనే పనులన్నీ పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల మండల ఉపాధ్యక్షులు భోనాలా ఖాదర్ ,నాగరాజు, వినయ్, ఆదిల్, ఫయాజ్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డిని వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల జయరామిరెడ్డి ఆరోగ్య రీత్యా సర్జరీ చేసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల ఎక్కువగా శ్రద్ధ పెట్టాలని చెప్పారు. పరామర్శించిన వారిలో టిడిపి నేతలు మహమ్మద్ ఇనాయతుల్లా, వేమా కుమార్, వార్డు మెంబర్ వెంకటేష్ తో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కోనంపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం 20 మందిని తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సిఫారసుచేసినట్టు సర్పంచ్ లక్ష్మీనారాయణ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగ పడిందని సర్పంచ్ చెప్పారు. భవిష్యత్తులో మరిన్నీ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకటేష్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది సర్పంచ్‌ను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడి నిమజ్జనాన్ని అడ్డుకున్న పెత్తందార్లు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని మారుమూల ప్రాంతమైన పొత్తపి గ్రామంలో దళితులు నిర్వహిస్తున్న వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని అగ్రవర్ణాల వారు అడ్డుకున్న సంఘటన చోటుచేసుకుంది. దళితుల కథనం మేరకు..ఊరేగింపుగా వెళుతున్న పొత్తపి దళిత గ్రామస్తులపై పటాకులు కాల్చొద్దు, డప్పు వాయిద్యాలు వాయిం చవద్దని, విగ్రహం ఊరేగింపు ఆపేయాలంటూ అగ్రవర్ణాలు దాడికి యత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్లతో కట్టలతో దాడికి యత్నించగా అక్కడి నుంచి పారిపోయి పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. తమపై ఐదుగురు దాడికి యత్నించారని పేర్కొన్నారు. దాడికి యత్నించిన అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్


నిందితుల అరెస్టును చూపుతున్న డిఎస్‌పి మహేంద్ర


హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిందితులని అరెస్టు చూపించారు. అరెస్టుకు సంబంధించి డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని బికెపల్లికాలనికి చెందిన షేక్ సలీంబాషాకు రాయచోటికు చెందిన షేక్ జావేద్, షేక్ షామీర్‌హుస్సేన్‌కు ఆస్తి తగాదాలు ఉన్నా యని చెప్పారు. గత కొంత కాలంగా ఇరు కుటుంబాల వారు పలుమార్లు ఘర్షణలకు పాల్పడ్డారన్నారు. ఎలాగైనా బికెపల్లి కాలనీలో ఉన్న షేక్ సలీంబాషా చెందిన ఇంటిని స్వాధీనం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో షేక్ జావేద్, షేక్ షామీర్ హుస్సేన్ తన బంధువులైన షేక్ ఇలాహీ, వేంపల్లి మస్తాన్, షేక్ అమీర్ సాహెబ్, కొమ్మిరి శెట్టి విశ్వనాథ్‌లను వెంటబెట్టుకొని ఈనెల 3న పట్టణంలోని బికెపల్లి కాలనీకి వచ్చారన్నారు. ఇంటి ముందు గేట్‌ను ధ్వంసం చేస్తుండగా కింద పోర్షన్ లో అద్దె కుంటున్న బుక్కె రమేష్‌నాయక్ ఎందుకలా చేస్తున్నారని అడ్డగించారని తెలిపారు. మొదట గేట్లు తీయాలని బలవంతం చేయగా, రమేష నాయక్ తీయక పోవడంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటిచారని తెలిపారు. అటుగా వచ్చిన స్థానికుడు ప్రశ్నించడంతో అతని ద్విచక్ర వాహనాన్ని కూడా ధ్వంసం చేశారని తెలిపారు. డయల్100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరడంతో నిందితులు పరారయ్యారని చెప్పారు. ఈశ్వర్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నింది తులను స్థానిక రామారావుకాలని ఆటోస్టాండ్ వద్ద అరెస్టు చేశారని చెప్పారు. కేసు పురోగతి సాధించడంలో, నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన సిఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లాను అభినందించారు.

కారుకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



పూర్తిగా కాలిపోయిన కారు

మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలోని పాత మసీదు సమీపంలో డీలర్ అన్వర్‌బాషాకు చెందిన మారుతి కారుకు గుర్తుతెలియని వ్యక్తులు కారుకు నిప్పు పెట్టారు. బాధితుడు అన్వర్‌బాషా మాట్లాడుతూ తన ఇంటి సమీపంలోని చెట్టు కింద కారు కొన్ని సంవత్సరాలుగా పెడుతున్నామని తెలిపారు. శుక్రవారం తెల్ల వారుజామున నిద్రపోయే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కారుకు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని తెలిపారు. కారు కాలుకుంటూ టైరు పగిలి శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసేసరికి కారు అప్పటికే సగం దగ్ధమైందని కారు సుమారు రూ.4లక్షలు విలువ చేస్తుందని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో ఘర్షణ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

పాత కక్షలతో ఘర్షణపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని కలకడ పంచాయతీ, కొత్తపల్లికు చెందిన అమరనాథ ను మరియు వారి అన్న కూతురుని పాత కక్షలు కారణంగా అదే గ్రామానికి చెందిన నితిన్, తరుణ్, వినోద్, సంతోష్ లు కలిసి కొట్టి గాయపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ హరినాథ్ తెలిపారు. ఈ ఘర్షణలో అమరనాథను కొట్టి తలకు బలమైన గాయం చేసినట్లు తెలిపారు. ఘర్షణ పడుతున్న సమయంలో అమరనాథ అన్న కూతురు అడ్డు రాగా ఆమెకు కూడా గాయాలైనట్లు తెలిపారు. అమరనాథ ఫిర్యాదు మేరకు ఘర్షణకు కారకులైన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న బొలెరో

- గ్రామ కమిటీ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు : ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీ కొన్న సంఘటన గ్రామ కమిటీ అధ్యక్షుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.మండలంలోని దేవుళచెరువు గ్రామ కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి సొంత పనుల నిమిత్తం రాజుగారిపల్లి నుంచి వేపూరికోటకు వచ్చారు. అక్కడి నుంచి ములకలచెరువుకు వస్తుండగా వేపూరికోట పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక వస్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శివారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ములకలచెరువు పోలీసులు విచారణ చేపట్టారు.